

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# సేవ - పతి సేవ

అర్ధరాత్రి.

డాక్టరు అరవింద ఇంట్లో ఫోన్ మోగుతోంది. డాక్టరు అయినందువల్ల అర్ధరాత్రి, అపరాత్రీ కూడా ఫోన్ కాల్స్ రావటం – ఆమె పది నిముషాల్లో తయారై డ్యూటీకి హాజరు కావటం మామూలే.

నిద్ర కళ్లతోనే ఆమె రిసీవర్ అందుకుంది.

"హలో" అంది.

అవతలి నుంచి ఎవరో – పరిచయం లేని వ్యక్తి తనను తాను పరిచయం చేసుకుని చెప్పాడు.

"మీకిప్పుడు రాత్రి అనుకుంటాను. ఈ సమయంలో మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు సారీ... ఇన్నేళ్లుగా మీరు చేసిన సేవలను గుర్తించి అంతర్జాతీయ సంస్థ మీకు బహుమతి ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన వివరాలతో మీకు త్వరలోనే లేఖ అందుతుంది.."

డాక్టరు అరవింద "థాంక్స్" చెప్పింది. ఆ అంతర్జాతీయ సంస్థ తనకు ఎందుకు అవార్డు ఇస్తోందో, ఆ సంస్థలో ఆయన హోదా ఏమిటో – ఆయన చెప్పినప్పుడు నిద్రమత్తులో విన్నది. మళ్లీ అడగాలనుకున్నది గానీ – అడగలేకపోయింది.

ఫోన్ పక్కన పెట్టేసి – ఏదో రాంగ్ నెంబర్ ఫోన్‌కాల్ వచ్చినంత తేలికగా – ఆ విషయం మర్చిపోయి నిద్రపోయింది.

మర్నాడు ఉదయం వార్తా పత్రికల్లో, టీవీల్లో, రేడియోల్లో – తనకు అవార్డు వచ్చిన విషయమే ప్రముఖంగా కనిపించడంతో అప్పుడుగానీ ఆ అవార్డు ప్రాముఖ్యం గురించి ఆమె పట్టించుకోలేదు.

తెల్సినవాళ్లు, ఫ్రెండ్స్, కొలీగ్స్ – ఫోన్ చేసి 'కంగ్రాట్స్' చెబుతున్నారు. ఎప్పుడో చిన్నప్పటి ఫ్రెండ్స్, కొద్దికాలం తనతో కల్సి పనిచేసిన వాళ్లు, పై అధికారులుగా పనిచేసిన వాళ్లు – తననొక విశిష్టమైన వ్యక్తిగా భావించి తన గుణగణాలను వివరిస్తూ ప్రకటనలు జారీ చేస్తున్నారు. అవన్నీ పత్రికల్లో చదువుతున్న అరవిందకు గతం జ్ఞాపకం వస్తోంది.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే – ఒకప్పటి భర్త శ్రీకాంత్ నుంచి వచ్చిన ఫోన్‌కాల్ మరొక ఎత్తు.

తనను అభినందించటంతో ఊరుకోక, అనుమతిస్తే చూడటానికి వస్తానన్నాడు. ఎప్పుడు తను ఫ్రీగా ఉంటుందో చెప్పమన్నాడు. తను పరాయిదేశంలో ఉంది.

ఆయన ఎక్కడో ఉన్నాడు. అంత దూరం నుంచీ రావాలి. రాబోయే కొద్దిరోజుల్లో తన ప్రోగ్రాం ఏమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. అందుచేత ఆయనకు ఏమీ చెప్పలేకపోయింది.

శ్రీకాంత్ ... ఒకప్పుడు తనను శాసించిన భర్త.. ఇప్పుడు చూడటానికి వచ్చేందుకు అనుమతి వేడుకుంటున్నాడు. కాలం ఎలాంటి గారడీలు చేస్తుందోననిపిస్తోంది.

అరవింద ఆ వేళ డ్యూటీకి వెళ్లదల్చుకోలేదు. వెళ్లినా అక్కడంతా అభినందనల కోలాహలం తప్ప ఇంకేమీ ఉండదు. ఆ హడావిడి అంతా పొద్దుటి నుంచీ ఇంటి దగ్గరా ఉంది. అరవిందకు ఈ ఆర్భాటాలు ఇష్టం ఉండదు. కొందరు బిరుదుల కోసం, పదవుల కోసం ఆరాటపడతారు. వారి వెంట పడతారు. కొందరిని ఆ బిరుదులూ, పదవులే వెతుక్కుంటూ వస్తాయి.

ముప్ఫయి ఏళ్ల కిందట 'డ్యూటీ' అన్న పదానికి ఆయనొక నిర్వచనం చెప్పారు. తనొక నిర్వచనం చెప్పింది. ఈ 'డ్యూటీ'యే ఇద్దరి మధ్యా అగాధాన్ని సృష్టించింది.

శ్రీకాంత్ ఐ.ఏ.ఎస్ ఆఫీసరు. అందం, చదువు, హోదా అన్నీ పుష్కలంగా ఉన్న అతనితో తన వివాహం అంగరంగవైభవంగా జరిగింది. జంట కన్నుల పండువగా ఉందనీ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లా ఉన్నదనీ పెళ్లికి వచ్చిన వాళ్లంతా ముక్తకంఠంతో అన్నారు.

పెళ్లి అయ్యాక కొద్దిరోజుల పాటు అలా దేశం తిరిగొచ్చారు. ఎక్కడికి వెళ్లినా ఆమెకు తన హాస్పిటల్, రోగులూ, మందులూ ఇవే గుర్తుకు వస్తుండేవి.

ఆ మాటే అంటే శ్రీకాంత్ నవ్వేవాడు. "నీకు తెల్సిన ప్రపంచం అదే. కానీ బయట సువిశాలమైన ప్రపంచం ఎంతో ఉంది. నీకు తెల్సిన ప్రపంచంలో రోగులు, బాధలు, నొప్పులూ, ఆపరేషన్లు, ఇంజక్షన్లు మాత్రమే కనిపిస్తాయి. నన్ను పెళ్లి చేసుకున్నందువల్ల నువ్వు చూడబోయే ఈ సరికొత్త ప్రపంచంలో అధికార పటాటోపం, నౌకర్లు, పలుకుబడి, డబ్బు, సుఖాలు, సౌఖ్యాలు ఇవీ నీకు ఎదురయ్యేవి.." అన్నాడు.

ఆమె విని ఊరుకుంది. కానీ భర్త అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయింది.

హనీమూన్ నుంచి తిరిగొచ్చారు.

మామూలు దినచర్య ప్రారంభమైంది.

ఆయన ఆఫీసరు. ఇంటినిండా నౌకర్లు, ఆయనకు సేవ చేయటమే వాళ్ల పరమావధిగా కనిపించేది. ఉదయం నిద్రలేవక ముందే వాళ్లు వచ్చి తమ ఇంట్లో పనులు చేయటానికి సిద్ధపడేవాళ్లు. అర్ధరాత్రి తాము నిద్రపోయే దాకా తమకు సేవ చేస్తూనే ఉండేవాళ్లు. అయినా ఆయన వాళ్లను తిడుతూనే ఉండేవాడు. కసురుకున్నట్లు కటువుగా మాట్లాడేవాడు. ఒక్కపూట అయినా ఎవరికీ సెలవు ఇచ్చేవాడు కాదు.

జ్వరం వచ్చినా వాళ్లు డ్యూటీ చేస్తూనే ఉండేవాళ్లు. అరవింద వాళ్లను చూసి జాలిపడేది. పిల్చి వాళ్ల ఆరోగ్యం సంగతి కనుక్కుని మందులు ఇచ్చేది. సరిగా వేసుకున్నదీ లేనిదీ అడిగి తెల్సుకునేది.

"నర్సమ్మా, ఏంటి తుమ్ముతున్నావ్?" అని అడిగేది.

"జలుబు చేసిందమ్మగారూ..."

"మరి ఏం చేశావ్?"

"చీదేస్తున్నానమ్మగారూ..."

ఆమె టాబ్లెట్స్ ఇచ్చి ఎలా వాడాలో చెప్పేది.

ఒక నౌకరు పెళ్లి నిశ్చయమైంది. వాడికి సెలవు ఇవ్వమంటే ఆయన ఒప్పుకోలేదు. ఆమె జోక్యం చేసుకుని సెలవు ఇప్పించింది. తీరా పెళ్లికి ముందురోజు జ్వరం పట్టుకొంది. వాడి ఇంటికి కారులో వెళ్లి ఇంజెక్షన్ ఇచ్చి వచ్చింది.

నౌకర్లు ఇద్దరికీ నమస్కారం చేస్తారు. కానీ ఆ నమస్కారాల్లో ఎంతో తేడా ఉంది. ఆయన పట్ల భయం, ఆమె పట్ల భక్తి.

"నువ్వు పనివాళ్లను పనివాళ్లలాగా చూడటం నేర్చుకోవాలి. లేకపోతే నెత్తికెక్కుతారు..." అనేవాడు శ్రీకాంత్.

"పనివాళ్లు అయినంత మాత్రాన వాళ్లను రాచి రంపాన పెట్టాలా?" అని అడిగేది అరవింద.

"వాళ్ల డ్యూటీ వాళ్లు చేస్తున్నారు. ఇందులో రాచి రంపాన పెట్టటం ఏముంది?"

"మన డ్యూటీ మనం చేస్తున్నట్లే వాళ్ల డ్యూటీ వాళ్ళూ చేయాలి. మనం రోజుకి ఎనిమిది గంటలు పని చేస్తే వాళ్లు పదహారు గంటలు ఎందుకు పని చేయాలి? వాళ్లకీ భార్యాబిడ్డలున్నారు. సాయంత్రం మీరు ఇంటికి వచ్చేటప్పటికి నేను ఇంట్లో ఉండాలి. మీతో సరదాగా సంతోషంగా కబుర్లు చెప్పాలి. మనం సినిమాలకీ, షికార్లకూ, షాపింగ్‌లకూ వెళ్లాలి. వాళ్లు మాత్రం రోగం వచ్చినా మనకు సేవ చేస్తుండాలి. ఇదెక్కడి న్యాయం?" అని అడిగింది.

"నీలాగా ఆలోచిస్తే మనం బతకటం కష్టం" అన్నాడు శ్రీకాంత్.

"వాళ్లు బతుకులు ఎంత కష్టంగా వెళ్లదీస్తున్నారో ఆలోచించలేనప్పుడు, మన బతుకుల కష్టాల గురించి వాళ్లు మాత్రం ఎందుకు ఆలోచించాలి?" అని అడిగింది అరవింద.

శ్రీకాంత్ సమాధానం చెప్పలేదు.

శ్రీకాంత్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. అరవిందకు ట్రాన్స్‌ఫర్ కాలేదు. అయ్యే అవకాశమూ లేదు.

కొద్దిరోజుల పాటు శ్రీకాంత్ ఆ ఊరికి వెళ్లి వస్తుండేవాడు. తరువాత ఒక వారం అతను వస్తే, ఒకవారం తను అక్కడికి వెళ్లి వచ్చేది. ఇద్దరికీ శ్రమగానే ఉంది.

"నువ్వా ఉద్యోగం మానెసెయ్" అన్నాడు శ్రీకాంత్.

"ఇంత చదువు చదువుకుని, ఈ వృత్తిలో కొద్దో గొప్పో పుణ్యం సంపాదించుకుని, అందరిచేతా మంచి డాక్టర్ అని పేరు తెచ్చుకున్న నేను ఉద్యోగం మానేయాలా? మానేసి ఏం చేయాలి?" అని అడిగింది అరవింద.

"అందరి భార్యలూ ఏం చేస్తున్నారో నువ్వూ అదే చేయాలి. నేను నిన్ను పెళ్లి చేసుకున్నది నాకు పక్కనే తోడుగా, నీడగా ఉంటూ సుఖ సంతోషాలు పంచుకుంటావని.. అంతేగానీ కొన్ని వందల మైళ్ల దూరంలో ఉండి "హలో పడుకున్నారా?" అని ఫోన్‌లో పలకరించే వాళ్లు తక్కువయ్యారని కాదు..." అన్నాడు శ్రీకాంత్.

"కానీ కాలంలో వచ్చిన మార్పుల వల్ల, భార్యాభర్తల అనుబంధాల్లో మార్పులు వచ్చాయి. మీ పక్కనే ఉంటూ మీకు మాత్రమే సేవలు చేసే భార్య కావాలని మీరు అనుకున్నప్పుడు... చదువుకుని ఉద్యోగం చేస్తున్న నన్ను చేసుకుని ఉండకూడదు. మిమ్మల్ని గౌరవించే వ్యక్తి భార్యగా లభించాలని

మీరు అనుకున్నట్లే నన్ను గౌరవించే వ్యక్తి భర్తగా లభించాలని నేను కోరుకుంటున్నాను. నన్ను గౌరవించటం అంటే, నా వృత్తినీ, నా డ్యూటీని కూడా గౌరవించటం అని..."

"అంటే నా మంచి చెడులు చూసుకునే డ్యూటీ నీకు లేదా?"

"రోజూ ఎంతమంది మీకు సేవ చేశారన్నదే మీకు సంతృప్తినిచ్చే విషయం. రోజూ ఎంత మందికి నేను సేవ చేయగలిగాను అన్నదే నాకు సంతృప్తినిచ్చే విషయం.." అన్నది అరవింద.

"ఇంతకీ నువ్వు చెప్పేది ఏమిటి?" అని అడిగాడు కోపంగా.

"మీ ఉద్యోగం మీకెంత ముఖ్యమో, నా ఉద్యోగం నాకంత ముఖ్యం"

"నీ ఉద్యోగం అంత ముఖ్యమేమీ కాదు. నేను నెల తిరిగేటప్పటికి వేలకు వేలు సంపాదిస్తున్నాను. అదంతా నీకే దక్కుతుంది. ఎంత ఖర్చు చేసినా తరగనంత డబ్బు.."

"డబ్బు కోసం కాదు ప్రతిమనిషీ తనకు చేతనైన పని చేయడంలో కొంత ఆనందాన్ని పొందుతాడు. తృప్తిని పొందుతాడు. మీ ఉద్యోగమే గొప్పది. నా ఉద్యోగం పనికిరానిది అనుకోవటం మీ అహంభావానికి చిహ్నం. నేను దేన్నయినా భరించగలను గానీ, ఆ అహంభావాన్ని భరించలేను..." అన్నది అరవింద.

"నువ్వు నా సుఖం గురించీ, సంతోషం గురించీ ఆలోచించనప్పుడు, నేనూ నీ గురించి ఆలోచించాల్సిన పనిలేదు. నేను నా గురించి ఆలోచించే మనిషిని చూసుకుంటాను.." అన్నాడు శ్రీకాంత్.

"మీ లక్ష్యం, ధ్యేయం అదే అయినప్పుడు, నన్ను ఆ బెదిరింపులతో లొంగదీసుకోలేరు..." అన్నది అరవింద.

అదే ఇద్దరూ చివరిసారి కల్సుకోవటం. ఆ రోజు నుంచీ ఇద్దరిదీ చెరోదారి అయింది. ఆయన ఎవరినో తెచ్చి ఇంట్లో పెట్టుకున్న విషయం ఆమెకు తెల్సింది. కానీ ఆయన గురించి పట్టించుకోలేదు.

ఆమె సౌదీ అరేబియా వెళ్లింది. అక్కడ కొంతకాలం రియాద్‌లో హాస్పిటల్‌లో పనిచేసింది. మరి కొంత కాలం ఆమె రెడ్‌క్రాస్‌తో కల్సి పనిచేసింది. అప్పట్లో ఆమెకు అనేకమంది ప్రముఖులతో పరిచయాలు పెరిగాయి.

అమెరికా వెళ్లింది. అక్కడ కొన్నాళ్లు పనిచేసింది. పీస్ కీపింగ్ ఫోర్స్‌లో చేరింది. యుద్ధాలు, అంతర్యుద్ధాలు జరుగుతున్న దేశాలకు శాంతిసేనలను పంపించినప్పుడు, ఆమె ఆయాదేశాలకు వెళ్లి క్షతగాత్రులకు సేవలు చేసేది.

ఒక మనిషి బాంబులు విసిరి, తుపాకీతో కాల్చి మరో మనిషిని చంపటానికి ప్రయత్నిస్తుంటే, చనిపోతున్న మనిషికి ప్రాణం పోయటానికి ఆమె నిద్రాహారాలు మాని, అనుక్షణమూ కృషి చేసింది.

మన దేశం కాదు... మన భాష కాదు.. మన జాతి కాదు.. అయినా మనిషికి బతుకు మీద ఉన్న మమకారం , తీపి ఒకటే. అందులో జాతిమత బేధాలు లేవు.

కాళ్లు విరిగిన వాళ్లకు చేతులు విరిగిన వాళ్లకు కట్లుగట్టి, వాళ్ల కన్నీరు తుడుస్తుంటే, ఆ బాధలో, ఆ భాషలో ఆమెను దీవించేవారు.

"ఏ తల్లి గన్న బిడ్డవో నువ్వు... ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఇక్కడికి వచ్చి నా బిడ్డ ప్రాణాలు కాపాడావు..." అని చేతులెత్తి మొక్కుతుంటే, అరవింద చిరునవ్వుతో భుజం తట్టి ధైర్యం చెప్పి వెళ్లిపోయేది.

అప్పుడప్పుడూ సాటి డాక్టర్లు అడిగేవాళ్లు.

"మీకు పెళ్లయిందా? ఫ్యామిలీ ఉందా?" అని

ఆమె నవ్వేసి ఊరుకునేది. జీవితంలో కొన్నిటిని పొందాలంటే కొన్నిటిని పోగొట్టుకోవాలి. ఇన్నేళ్లలో ఆమె దాదాపు యాభై దేశాల్లో తిరిగింది. ప్రజలమధ్య వారి పోరాటాల మధ్య, యుద్ధాల మధ్య, కక్షలు, కార్పణ్యాల మధ్య స్వేచ్ఛగా తిరిగింది.

ఒకప్పుడు తన భర్త అన్నాడు – తనకు తెల్సిన ప్రపంచం చాలా తక్కువ అని. నిజానికి ఆయనకు తెల్సిన ప్రపంచమే చాలా తక్కువ.

ఒకప్పుడు తన భర్త అన్నాడు – తన ఉద్యోగం ఏమంత ముఖ్యం కాదని. ఆయన వేలకు వేలు అక్రమార్జన చేసి ఉండొచ్చు. ఆ డబ్బు ఆయనకు ఇవ్వలేని తృప్తి, ఈ బాధితుల నుంచి లభిస్తున్న కృతజ్ఞతలో తనకు లభిస్తోంది.

ఇవాళ తన సేవలకు గుర్తింపు లభించింది. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. దీనికి ఖరీదు కట్టే షరాబులెవ్వరు? ఇంతకన్నా గొప్ప పదవి ఏముంది?

అరవింద నిట్టూర్చింది. భోజనం చేయబుద్ధి కాలేదు. అలసిన మనసుకు విశ్రాంతి అవసరం. కాసేపు నిద్రపోదామని అనుకుంటుండగానే మళ్లీ ఫోన్ మోగింది.

ఒకప్పటి స్నేహితురాలు... అభినందనలు తెలియజేసింది.. తరువాత మరికొన్ని విషయాలు చెప్పింది.

శ్రీకాంత్ అవినీతి కేసుల్లో చిక్కుకుని అరెస్టు అయి, విడుదలై... తీరని కష్టాల్లో ఉన్నాడనీ చెప్పింది. ''సేవలందుటే గానీ సేవించి ఎరుగని వాళ్లకు – సేవల విలువ ఎలాంటిదో తెలియదు' – అనుకుంది అరవింద.

★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.